లక్ష్మీనరసింహుడికి వైభవంగా వెండి మొక్కుజోడు సేవ

క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 15 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామికి వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుడ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేపు చేసి ప్రాకార మండపంలో ఊరేగించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకు పూజ చేశారు. ప్రధానాలయంతోపాటు విష్ణు పుష్కరిణి చెంతనగల ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి పూలమాలలతో అలంకరించారు. వెయ్యి తమలపాకులతో సహస్రనామార్చన జరిపి వడపప్పు, బెల్లం నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.21.99,248 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

● జిల్లా విద్యాధికారి సత్యనారాయణ

మోటకొండూరు : ముత్తిరెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 15 : ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ సమయ పాలన పాటించి విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని డీఈఓ కందుల సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9, 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రికార్డులను తనిఖీ చేశారు. వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనివాసాచారి, అనూరాధ, వెంకటేశం పాల్గొన్నారు.

ముత్తిరెడ్డిగూడెం ఉన్నత పాఠశాలల సందర్శన

మోటకొండూర్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను డీఈఓ కె.సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు గఫార్, రజిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వి.కృష్ణ

రాజాపేట : సింగారంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పశు సంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకుడు గోపిరెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వి.కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15నుంచి నవంబర్ 14వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 1,64,400 పశువులు, గేదెలు ఉన్నాయని, జిల్లాలోని 17 మండలాల్లో 45 బృందాలు ఏర్పాటు చేసి టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. టీకాలు వేసిన పశువుల సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి

రాజాపేట : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు ఇప్పించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ గోపిరెడ్డి సూచించారు. మండలంలోని సింగారం గ్రామంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 220 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి చంద్రారెడ్డి, సిబ్బంది అశోక్, గోపాల్, బాలకిషన్, రాంచందర్ రైతులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని కొలనుపాక, శారాజీపేట, ఆలేరులో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మొత్తం 263 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి చైతన్య తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌రెడ్డి, పశు వైద్య సిబ్బంది శ్రీనివాస్, రమ, వరలక్ష్మి, నర్సింహ, స్వామి, శ్రావణ్, గోపి పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరంలో పశు వైద్యశాల ఆవరణలో 89 గేదేలు, 58 ఆవులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. టీకాల పంపిణీ నవంబర్ 14వరకు కొనసాగుతుందని మండల పశు వైద్యాధికారులు కె.జ్యోత్స్న, ఇందిర తెలిపారు. కార్యక్రమంలో వీఎల్ఓ సుభాషిణీ, వీఏలు భాను, మౌనిక, రాజేందర్, గోపాల మిత్రలు మల్లేశ్, సురేశ్, మదర్ డెయిరీ గ్రామ చైర్మన్ సింగనబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పోచంపల్లి పట్టణ అధ్యక్షుడి రాజీనామా

● పలువురు వార్డు అధ్యక్షులు కూడా..

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 15 : బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు రాజీనామాకు సంఘీభావం తెలుపుతూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మున్సిపాలిటీలోని పలు వార్డుల అధ్యక్షులు మంగళవారం పార్టీకి రాజీనామా చేశారు. లవకుమార్ రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు అందెం సంజీవరెడ్డికి, వార్డు అధ్యక్షులు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడికి అందజేశారు. 30 ఏండ్లుగా పార్టీ కోసం పనిచేశానని, పదవి ఉన్నా, లేకున్నా బతికినంత కాలం పార్టీ కోసం పని చేస్తానని లవకుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తడక వెంకటేశ్వర్లు నాయకత్వంలో కార్యకర్తగా పనిచేస్తానని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఆయా వార్డుల అధ్యక్షులు దారెడ్డి భాస్కర్‌రెడ్డి, గుండ్ల నవనీత, కుక్క కుమార్, మెరుగు యతీనందం, సామల సుధాకర్‌రెడ్డి, కూరపాటి బాబు, చేరాల మహేందర్, వేముల ఆనంద్, బిజిలి కుమార్, గుండు ఉప్పలయ్య ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● సర్కారు తీరుకు నిరసనగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్

చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమానులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. బకాయిల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ భువనగిరి పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మంగళవారం బంద్ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి వినాయక చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నవభారత్ డిగ్రీ, పీజీ ప్రైవేటు కళాశాల కరస్పాండెంట్ చిక్క ప్రభాకర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ, అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దె, విద్యుత్ బిల్లు, ప్రాపర్టీ ట్యాక్స్ భారంగా మారిందన్నారు. దీంతో కళాశాలలను మూసివేసే పరిస్థితులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు. లేకుంటే బంద్‌ను నిరవధికంగా కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాలల యజమానులు సింగనబోయిన మల్లేశం, దరిపల్లి నవీన్‌కుమార్, ఎ.మణిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేటలో శ్రీ హిందూ డిగ్రీ కళాశాలను మూసివేసి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

చౌటుప్పల్‌లో ర్యాలీ, ధర్నా

చౌటుప్పల్ రూరల్ : పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రైవేటు కళాశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల శంకర్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పి, పది నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల చైర్మన్ బత్తుల శంకర్, మాతృశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, రాములు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో కాలేజీ బంద్

రామన్నపేట : ప్రైవేటు డీగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల పిలుపు మేరకు మండల కేంద్రంలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కాలేజీ గేటు మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పనకంటి భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో తప్పని పరిస్థితుల్లో నిరసనకు దిగినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్తు బోల్తా.. యువకుడి మృతి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 15 : మండల పరిధిలో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్‌నగర్‌కు చెందిన వీరమల్లు వినీత్(17), నలుగురు స్నేహితులతో కలిసి కారులో సోమవారం రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరారు. అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు స్టేజీ వద్ద ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలైన వినీత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమయంలో వినీత్ స్నేహితుడు అంకుశ్ డ్రైవింగ్ చేస్తున్నాడని సీఐ తెలిపారు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

తప్పించుకొన తిరుగుతున్న నేరస్తుడు అరెస్ట్

పోలీసుల అదుపులో శంకర్

అడ్డగూడూరు, అక్టోబర్ 15 : మూడు సంవత్సరాల జైలు శిక్ష పడి తప్పించుకు తిరుగుతున్న నేరస్తుడిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్దేవి గ్రామానికి చెందిన గోలి శంకర్(48)పై 2020 సంవత్సరంలో కేసు నమోదైంది. ఆ కేసులో విచారణ అనంతరం భువనగిరి కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. హైకోర్టులో అప్పీలు చేసేందుకు బెయిల్‌పై బయటకు వచ్చిన శంకర్ తప్పించుకొని తిరుగుతున్నాడు. ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం పక్కా సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ రామనర్సయ్య, కానిస్టేబుల్ రజినీకాంత్ పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు.

అనారోగ్య సమస్యతో వ్యక్తి ఆత్మహత్య

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 15 : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చెక్క యాదయ్య ముదిరాజ్ (60) అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదయ్య అద్దె ఇంట్లో ఉంటూ చేపల వృత్తి చేస్తూనే కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆర్థిక సమస్యలతో వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైపునకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుడి పనికి వెళ్లిన ఆయన భార్య హంసమ్మ మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి. ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు తెరిచేసరికి విగత జీవిగా కనిపించడంతో బోరున విలపించింది. యాదయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య హంసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అద్దె చెల్లించలేదని గురుకుల పాఠశాలకు తాళం

● పెండింగ్‌లో రూ.16లక్షల కిరాయి

మోత్కూరు గురుకుల పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు, అక్టోబర్ 15 : మున్సిపాలిటీలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల భవనానికి అద్దె చెల్లించడం లేదని భవనం యజమాని పాఠశాల గేటుకు మంగళవారం తాళం వేశారు. ప్రభుత్వం 9నెలల అద్దె రూ.16లక్షలు చెల్లించాల్సి ఉందని భవనం యజమాని సీహెచ్ సత్యంగౌడ్ తెలిపారు. అద్దె చెల్లించాలని పాఠశాల ప్రిన్సిపాల్, జోనల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే గేటుకు సోమవారం ఫ్లెక్సీ పెట్టామన్నారు. అయినా స్పందించకపోవడంతో గేటుకు తాళం వేశానని చెప్పారు. అయితే.. ఆ సమయంలో అక్కడే ఉన్న ప్రిన్సిపాల్, సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా యజమాని పట్టించుకోకుండా తాళం వేసి వెళ్లిపోయాడని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

గురుకుల పాఠశాలలకు తక్షణమే అద్దె చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రు అనిల్ డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి మంగళవారం పట్టణంలోని గురుకుల పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. అద్దెలు చెల్లించకపోవడం వల్ల పాఠశాల భవనాలకు యజమానులు తాళం వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలి'

తాసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న బీఈడీ అభ్యర్థులు

బొమ్మలరామారం, అక్టోబర్ 15 : డీఎస్సీ 2004 ఉద్యోగ నియామకాల్లో బీఈడీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, రాబోయే డీఎస్సీలోనైనా న్యాయం చేయాలని బీఈడీ అభ్యర్థుల సంఘం మండల కన్వీనర్ మైలారం జంగయ్య అన్నారు. డీఎస్సీలో ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా కాకుండా డీఎస్సీతో నియామకం చేపట్టాలని కోరుతూ తాసీల్దార్ శ్రీనివాస్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ తరువాత ఉండే జనరల్ పోస్టులకు మాత్రమే ఈడబ్ల్యూఎస్ వర్తింపజేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ తరువాతే నియామకాలు చేపడుతామన్న ముఖ్యమంత్రి ఏకపక్షంగా డీఎస్సీ నియాయకాలు చేయడంతో మాదిగ అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఈడీ అభ్యర్థులు ముమ్ముడి శ్రీశైలం, ఎల్లబోయిన శ్రీహరి పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తిదాయకం

అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 15 : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాఘవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేశ్ అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని సుభాశ్ చంద్రబోస్ విగ్రహం వద్ద మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కలాం సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం, రాష్ట్రపతి పదవిని ఇచ్చిందన్నారు. ది గ్రేట్ ఇండియన్, మిస్సైల్ మెన్‌గా పేరు సాధించిన కలాం.. 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి' అని యువతకు పిలుపునిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పి.రాములు, శంకరయ్య, రాజు, సందీప్, ఫయాజ్, రామచందర్‌గౌడ్, నాగరాజు, సిద్ధులు, ప్రశాంత్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి : టీఎస్ ఎమ్మార్పీఎస్


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ వడాయిగూడెం గ్రామ శాఖ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 15 : మండలంలోని వడాయిగూడెంలో దసరా పండుగ సందర్భంగా టీఎస్ ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపివేసిన దుండగులను గుర్తించి శిక్షించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అక్కసుతో చింపివేస్తున్నారని, గతంలో సైతం పలుమార్లు ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగా చింపివేశారని అన్నారు. దుండగులను గుర్తించి కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు కోట స్వామిదాసు, టీఎస్ ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కోట యాదగిరి, ఉపాధ్యక్షుడు కోట చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కోట సుధాకర్, సహాయ కార్యదర్శి భిక్షపతి, నాయకులు గౌరయ్య, పెద్ద రామచందర్, అంజయ్య, జహంగీర్ పాల్గొన్నారు.

ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి వినతి పత్రం ఇస్తున్న ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కేంద్రమంత్రి గడ్కరీకి వినతి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 15 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గండ్కరీని చౌటుప్పల్ మండల రైతులు ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో చౌటుప్పల్ మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని, ఇప్పటికే పలుమార్లు రోడ్డు వెడల్పులో భూములు కొల్పోయి నష్టపోయామని వెల్లడించారు. రైతులను ఆదుకోవడానికి బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని, లేదా వ్యవసాయం చేసుకునే రైతులకు భూమికి బదులు భూమిని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, నాయకులు, రైతులు దుబ్బాటి రాములు గౌడ్, సందగళ్ల మల్లేశం గౌడ్, జాల వెంకటేశ్ యాదవ్, చింతల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు

మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు

రాజాపేట, అక్టోబర్ 15 : మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు హైదరాబాద్ నందినగర్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

వివేరా హోటల్‌లో గడువు దాటిన కూల్‌డ్రింక్స్

● ధ్వంసం చేసిన జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు

వివేరా హోటల్‌లో వంట నూనె ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు సుమన్‌కల్యాణ్, స్వాతి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పాటించని హోటళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్‌కల్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి అన్నారు. వినియోగదారుల ఫిర్యాదు మేరకు పట్టణంలోని వివేరా హోటల్‌లో షెడ్యూల్ 4 ప్రకారం మంగళవారం తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లోని వంట గది, స్టోర్ రూమ్, కూరగాయలు, పిండి, నూనె, పప్పులను పరిశీలించారు. వాటి నాణ్యత, ఐఎస్ఐ మార్కు, ఎక్స్‌పైర్ తేదీని పరిశీలించారు. గడువు దాటిన కూల్‌డ్రింక్స్‌ను పగులగొట్టారు. హోటల్‌లో అపరిశుభ్రతపై నోటీసులు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు, బొద్దింకలు పడకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వాడకూడదని, తాజా పదార్థాలు, కూరగాయలను వాడాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. అందులో కల్తీ జరిగినట్లు తేలితే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

దుర్గామాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మాట్లాడుతున్న అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 15 : సికింద్రాబాద్‌లోని దుర్గామాత దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ముష్కరులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని భువనగిరి అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దుర్గామాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. హిందూ దేవతల విగ్ర